# 3 కిలోమీటర్లు.. 3 వేల హోర్డింగులు

- నార్సింగిలో చెట్లను తొలగించి బోర్డులు ఏర్పాటు
- మున్సిపాలిటీ అనుమతులే లేవు..
- ఆర్అండ్‌బీ పేరు చెప్పి తప్పించుకుంటున్న కాంట్రాక్టర్లు

మణికొండ, జనవరి 10: నార్సింగిలో అనుమతులకు విరుద్ధంగా..చెట్లను తొలగించి మరీ హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు కాంట్రాక్టర్లు. మున్సిపాలిటీ నుంచి అనుమతులు లేకున్నా తమకు ఆర్అండ్‌బీ అనుమతిచ్చిందని దబాయిస్తున్నారు. ఒకటి కాదు 2 కాదు దాదాపు 3కిలోమీటర్ల పొడవైన రహదారిలో 3వేలకు పైగా హోర్డింగులు ఏర్పాటు చేశారు. తద్వారా రియల్ ఎస్టేట్ నిర్మాణ రంగ సంస్థలకు విపరీతమైన ప్రచారం కల్పిస్తున్నారు. ఈ తతంగానికి మున్సిపాలిటీ పాలక వర్గంలోని కొంతమంది పెద్దలు సంపూర్ణ సహకారం అందించి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నట్టు.. స్థానిక నివాసులే బాహాటంగా ఆరోపణలు చేస్తున్నారు.

**నార్సింగి-శంకర్‌పల్లి- ఖానాపూర్ వరకు..**

నార్సింగి మున్సిపాలిటీ పరిధి మొదలు నుంచి శంకర్‌పల్లి ఎక్స్‌రోడ్డు, అక్కడ నుంచి మున్సిపాలిటీ చివర ఖానాపూర్ గ్రామ శివారు వరకు వేలాదిగా హోర్డింగు(లాలీపాప్)లు రోడ్డు మధ్యలో పోటాపోటీగా ఏర్పాటైయ్యాయి. నిబంధనల ప్రకారం 300మీటర్లకు ఒకటి చొప్పు పెట్టాల్సిన పెద్ద హోర్డింగులు పది అడుగుల దూరంలో ఏర్పాటు చేశారు. హోర్డింగుల ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయంటూ ప్రజలు అధికారులకు చెబితే.. ఆర్అండ్‌బీ శాఖదే బాధ్యత అంటూ మున్సిపాలిటీ శాఖ తప్పించుకోవడం గమనార్హం.


**కోట్లల్లో లావాదేవీలు**

మున్సిపాలిటీలో గత కొన్నాళ్లుగా ఓ కాంట్రాక్టర్ అటు అధికారులు..ఇటు పాలక వర్గానికి రింగ్‌మాస్టర్‌గా వ్యవహరిస్తూ అన్నీ తానై నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ వైపు సివిల్ కాంట్రాక్టర్ పనులు చేస్తూ అక్కడా నాణ్యతాప్రమాణాలను పాటించకుండా.. ఇప్పుడు తాజాగా హోర్డింగుల జాతరలో అనుమతులు లేకుండా అధికారులను బుట్టలో వేసుకుని కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నాడని స్థానికులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా రోడ్డు భవనాలశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని రహదారుల మధ్యలో ఏర్పాటు చేస్తున్న హోర్డింగుల వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. రోడ్డు మధ్యలో హోర్డింగులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నెలకొంటాయని అప్పటి మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి తప్పవని బాధ్యులకు నోటీసులు జారీచేశారు. కానీ కొత్త సర్కారు ఏర్పాటైన నెలరోజుల వ్యవధిలోనే వేలసంఖ్యలో హోర్డింగుల జాతర ఏర్పాటవడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.



గండిపేట చౌరస్తా వద్ద అనుమతి లేకుండా అడుగుకొకటి చొప్పున ఏర్పాటు చేసిన మినీ హోర్డింగులు


**అనుమతులు లేవు..**



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన అడ్డగోలు హోర్డింగులకు మున్సిపాలిటీ నుంచి ఎక్కడా అనుమతులివ్వలేదు. గత కమిషనర్ హయాంలో ఇచ్చిన అనుమతుల గడువు ముగిసింది. పలుమార్లు మేం కూల్చివేశాం. అయినా కొంతమంది కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆర్అండ్‌బీ శాఖ నుంచి అనుమతులు పొందామని చెబుతున్నారు. ప్రతిరోజూ ప్రజల నుంచి ఫిర్యాదు వస్తూనే ఉన్నాయి. కూల్చివేస్తున్నా రాత్రిపూట ఏర్పాటు చేస్తున్నారు.

-సురేందర్‌రెడ్డి,
నార్సింగి మున్సిపల్ కమిషనర్

## ఇంజినీర్స్ డైరీ ఆవిష్కరణ



అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ డైరీని బుధవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాస్, నాగరాజు, కోశాధికారి సంతోశ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు అనిల్ సాగర్, వంశీధర్‌గౌడ్, మనోహర్‌బాబు, గౌస్, రాఘవేంద్ర, సిద్ధార్థ, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, జనవరి 10

## వరసిద్ధివినాయక హోమంలో ఎమ్మెల్యే



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం వరసిద్ధి వినాయక హోమంలో పాల్గొన్నారు. పూజలు నిర్వహించి వేద పండితుల నుంచి ఆశీస్సులు పొందారు.

– జూబ్లీహిల్స్, జనవరి 10

## కస్తూర్బాలో సంక్రాంతి ముగ్గులు



సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం బండ్లగూడ కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలోని ఆవరణలో ముగ్గులు వేసిన ఉపాధ్యాయులు – బండ్లగూడ, జనవరి 10

## చదువుకుంటేనే విద్యార్థులకు బంగారు భవిష్యత్



మణికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

మణికొండ, జనవరి 10: చదువుకుంటనే విద్యార్థులు బంగారు భవిష్యత్తు ఉంటుందని మణికొండ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ అన్నారు. పురోహితులు డాక్టర్ మండువ మధుసూదన్‌శర్మ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తన కూతురు ఎం.హర్షిత పుట్టిన రోజు సందర్భంగా 200మంది విద్యార్థులకు బుధవారం అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నిరంజన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎం.అపర్ణ, ఎం.భరద్వాజ్‌శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేర్వేరు చోట్ల దుకాణాల్లో చోరీ

బేగంపేట్, జనవరి 10 : రాత్రి దు కాణాల షట్టర్లను తొలగించి రూ. 4 లక్షల నగదును దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ వ్యాపారి అశోక్‌కుమార్ గార్గా పేరుతో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా సోమవారం షాపు మూసి ఇంటికెళ్లాడు. మరుసటి రోజు వచ్చేసరికి షట్టరు తెరిచి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో పెట్టిన నగదు కనిపించలేదు. దీంతో పాటు అదే ప్రాంతంలో ఉన్న రోహిత్ ఇంటర్నేషనల్ షాపులో కూడా షట్టర్‌ను తొలగించి కౌంటర్‌లో ఉన్న రూ.30 వేల నగదు దోచుకెళ్లారు. ఇరు దుకాణాల యజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మహంకాళి ఏసీపీ రవీందర్ యాదవ్, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ల క్లూస్ టీం ను పిలిపించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, జనవరి10: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బుద్వేల్ గ్రీన్ సిటీ కాలనీలో రూ.60లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు భేష్**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను దేశంలోనే నంబర్‌వన్ పోలీస్‌స్టేషన్‌గా కేంద్ర ప్రభుత్వం గురించి ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ అవార్డును కూడా అందుకున్న విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బుధవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబును సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి ద్వారానే రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు ఈ అవార్డు వచ్చిందని అన్నారు. అవార్డు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బుద్వేల్ గ్రీన్‌సిటీలో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



లక్ష్మీగూడలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలతో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

**తెలుగుదనం ఉట్టిపడే పండుగ సంక్రాంతి**

మైలార్‌దేవ్‌పల్లి : తెలుగుదనం ఉట్టిపడే పండుగ సంక్రాంతి అని ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడలో బుధవారం బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాళ్లు అడికె లావణ్య, శరణమ్మల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.బీఆర్ఎస్ డివిజన్ యువ నాయకులు రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సాగురంగంలో డ్రోన్‌ల వినియోగం అవసరం

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 10: సాగు రంగంలో డ్రోన్‌ల వినియోగం ఎంతో అవసరమని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం వర్సిటీ పరిధిలోని డ్రోన్ అకాడమీ పరిధిలో డ్రోన్‌ల పనితీరుపై మహిళలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ బ్యాచ్‌కు ఉత్తరప్రదేశ్ మహిళా ప్రతినిధులు 22 మంది హాజరవడం అభినందనీయమన్నారు. డ్రోన్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ రామ్‌గోపాల్ వర్మ, కిరణ్‌బాబు, మారుత్ డ్రోన్ సహాయ వ్యవస్థాపకులు డాక్టర్ పెద్ది సూరత్, రాములు పాల్గొన్నారు.

## హుండీ చోరీకి యత్నం.. వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,జనవరి 10: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆలయంలోని హుండీని పగలగొట్టేందుకు ప్రయత్నించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట సమీపంలోని మైసమ్మ ఆలయం ఆవరణలోకి మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి గ్రిల్స్ తొలగించి ఆలయంలోకి ప్రవేశించాడు. రాడ్‌తో ఆలయం హుండీని పగలగొట్టేందుకు ప్రయత్నిస్తుండగా గుర్తించిన స్థానికులు వచ్చి దుండగుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుడు గోల్కొండకు చెందిన ఫిరోజ్ ఖాన్‌గా గుర్తించారు. ఆవారాగా తిరుగుతూ మద్యం కోసం చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. డబ్బుల కోసం హుండీ చోరీకి యత్నించినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు.

## కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ఖైరతాబాద్, జనవరి 10: కారు ఢీకొని మహిళా ఉద్యోగికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యాప్రాల్ కిందిబస్తీకి చెందిన పొనగంటి బాలామణి (54) బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. విధులకు వెళ్తూ ఏజీ కార్యాలయం వద్ద బస్టాండ్‌లో రోడ్డు దాటుతుండగా, వేగంగా వచ్చిన క్యాబ్ ఢీకొట్టింది. దీంతో ఆమె తల, ముఖం, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. సదరు క్యాబ్ డ్రైవర్ ఆమెను ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స అందిస్తున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

మణికొండ, జనవరి 10: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, నిరంతరం కష్టపడి చదువాలని పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్, యూఎస్ కాన్సలేట్ జనరల్ జోనాథన్ సూచించారు. మహాత్మ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్‌పై సదస్సు నిర్వహించారు. సీజీపీ-యూజీఐటీ, ఎడ్యూకేషన్ యూఎస్‌ఏ సంయుక్తంగా ఇంజినీరింగ్ యువర్ ఫ్యూచర్ నావిగేటింగ్ ది యూఎస్ యూనివర్సిటీ అప్లికేషన్ ప్రాసెస్ అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు యూనైటెడ్ స్టేట్స్‌లో ఉన్నత విద్యా అవకాశాలపైన కీలకమైన అంశాలను అందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేస్తే మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కాన్సలేట్ ఆఫీసర్ శ్యామ్ వీసీ నిబంధనలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేశించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ ఎడ్యూకేషన్ సలహాదారు సహార్ రఫీక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, సీజీసీ-యూజీఐటీ చైర్మన్ డాక్టర్ సీ.ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్, యూఎస్ కాన్సలేట్ జనరల్ జోనాథన్

# పేద క్రైస్తవులకు పథకాలు అందేలా చూడాలి

బంజారాహిల్స్.జనవరి 10: పేద క్రైస్తవులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడటంతో పాటు పాస్టర్ల సమస్యల సాధనకు ఐక్యంగా పాటుపడాలని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 షరోన్‌ఫుల్ చర్చిపాస్టర్, సీనియర్ పాస్టర్ల సంఘం నేత రెవరెండ్ ఎం.ప్రభుదాస్ సూచించారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఖైరతాబాద్ నియోజకవర్గ పాస్టర్ల సదస్సులో రెవరెండ్ ప్రభుదాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో పేద క్రైస్తవులున్నప్పటికీ వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు అందడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ పరిధిలోని పేద క్రైస్తవులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యతను పాస్టర్లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు రవి, మైఖెల్, జీవన్, ప్రభుదాస్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 చర్చిలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న పాస్టర్లు

# చురుకుగా అభివృద్ధి పనులు

- కేవీబీఆర్ స్టేడియంలో బాక్స్ టైప్ డ్రైన్ స్లాబ్ పనులు ముమ్మరం

జూబ్లీహిల్స్,జనవరి10: ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు కొత్త ప్రభుత్వం కొలువుదీరాక వేగం పుంజుకున్నాయి. పార్లమెంట్ ఎన్నికలు సైతం ముంచుకొస్తుండడంతో అభివృద్ధి పనులు చురుకుగా చేయించడంలో అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో బాక్స్ టైప్ డ్రైన్ పనుల్లో భాగంగా నాలా స్లాబ్ నిర్మాణ పనులను ముమ్మరంగా జరుగుతున్నాయి. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ నుంచి పోలీస్ బెటాలియన్, కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం మీదుగా ఎల్ఎన్ నగర్ నాలాలో కలిసేలా చేపడుతున్న ఈ పనులను జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ నాలా పనులు తుది దశకు చేరుకున్నాయని డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు తెలిపారు.



కేవీబీఆర్ స్టేడియంలో జరుగుతున్న బాక్స్ టైప్ డ్రైన్ స్లాబ్ పనులు

## 6,7 తేదీల్లో జాతీయ నృత్యోత్సవాలు

హిమాయత్‌నగర్, జనవరి 10: దాద్రి నృత్యోత్సవం పేరిట ఫిబ్రవరి 6,7 తేదీల్లో రవీంద్రభారతీలో జాతీయ నృత్యోత్సవం నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కళాకృతి నృత్యాలయ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ ఎం.భారతి బుధవారం సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

## బోరబండలో అయోధ్య రామయ్య పాదుకలు



బోరబండ సాయిబాబా ఆలయంలో అయోధ్య రామయ్య పాదుకలు

ఎర్రగడ్డ, జనవరి 10: అయోధ్య రామయ్య పాదుకలు బుధవారం బోరబండలో దర్శనమిచ్చాయి. పీఠాధిపతులు, వేద పండితులు ఓ ప్రత్యేక వాహనంలో ఉదయం 10 గంటలకు బోరబండ బస్టాండ్ వద్ద ఉన్న దేవాదాయశాఖకు చెందిన సాయిబాబా ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు, పెద్దలు కలిసి మినీ మండపాన్ని ఏర్పాటు చేసి రాములవారి పాదుకలను భక్తుల దర్శనార్థం అందుబాటులో ఉంచారు. దీంతో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి పాదుకలను దర్శించుకొన్నారు. అనంతరం ఆ పాదుకలను మోతీనగర్‌లోని శృంగేరి శంకర మఠానికి తీసుకెళ్లారు.

## రాములోరి అక్షింతల పంపిణీ




బంజారాహిల్స్, జనవరి 10: అయోధ్య శ్రీరామచంద్ర స్వామి ఆలయం జనవరి 22న ప్రారంభం కానున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయం ఎల్ఏసీ సభ్యులు బోజిరెడ్డితోపాటు నిరంజన్, సురేశ్‌శర్మ, ప్రసాద్, నగేశ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిలో అండర్‌పాస్‌లు నిర్మించాలి

శంషాబాద్ రూరల్, జనవరి 10: హైదరాబాద్– బెంగుళూరు జాతీయ రహదారిలో అరంఘర్ నుంచి పాలమాకుల గ్రామం వరకు గ్రామాలు కలిసే చోట అండర్‌పాస్‌ల నిర్మాణాలు చేపట్టాలని శంషాబాద్ మాజీ ఎంపీపీ, పెద్దషాపూర్ ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అరంఘర్ నుంచి పాలమాకుల గ్రామం వరకు ప్రజలు రోడ్డు దాటడం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకోసం గగన్‌పహాడ్ వద్ద నిర్మాణం చేసిన విధంగా సాతంరాయి, సిద్ధాంతి, తొండుపల్లి, ఘాన్సిమియాగూడ, పెద్దషాపూర్, మదన్‌పల్లి, పాలమాకుల గ్రామాల వద్ద జాతీయ రహదారిలో అండర్‌పాస్‌లను నిర్మాణం చేస్తే ప్రజలకు రోడ్డు దాటే ఇబ్బందులు తప్పుతాయన్నారు.

## నోటు పుస్తకాలు అందజేత

బన్సీలాల్‌పేట్, జనవరి 10 : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.సి.సుంకి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమయ పాలన అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని, చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ సుధాకర్, లయన్ డిమ్మి, లయన్ రఘువర్మ, పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.